ప్రజాశక్తి
సోమవారం 22 ఏప్రిల్ 2024
8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

టిడిపిలో బిజెపి రమేష్ చక్రం

- మాడుగులలో పైలాను మార్చడంలో కీలకపాత్ర
- ఆధిపత్యంపై మాట్లాడలేక నాయకుల మౌనం
- బండారుకు బి.ఫారం

బిజెపి అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సిఎం.రమేష్

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, మాడుగుల విలేకరి

అనకాపల్లి లోక్‌సభ బిజెపి అభ్యర్థి సిఎం.రమేష్ తెలుగుదేశం పార్టీలో చక్రంతిప్పుతిన్నారు. ఆయన బిజెపి అభ్యర్థి అయినా.. మూలాలు టిడిపితో వుండడంతో ఆ పార్టీ అధినేత చంద్రబాబుతో చెప్పుకొని ఎన్నికల్లో తన లబ్ధి కోసం అవసరమైన సర్దుబాట్లు చేసుకుంటున్నారు. టిడిపి మద్దతుతో గెలుస్తానన్న ధీమాతో ఒక శాతం ఓటున్న బిజెపి నుంచి రమేష్ అనకాపల్లి లోక్‌సభ బరిలో దిగారు. తన విజయానికి తగిన ఏర్పాట్లు, సర్దుబాట్లు టిడిపిలో చేయడంతో ఆ పార్టీలో కొత్త సమస్యలు ఏర్పడుతున్నాయి. మాడుగుల టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా పైలా ప్రసాదరావును ప్రకటించిన చంద్రబాబు నోటితోనే.. ఆయనను కాదని, పెందుర్తి మాజీ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తికి టికెట్ ఇప్పించగలిగారు. జిల్లాలో టిడిపి నాయకత్వానికి రమేష్ ఆధిపత్యం మింగుడు పడకపోయినా ఆయనకు చంద్రబాబుతో వున్న సహచర్యంతో మాట్లాడే ధైర్యంలేక మౌనం దాల్చుతున్నారు.

ఇంతకీ ఏం జరిగిందంటే..

పొత్తులో పెందుర్తి స్థానం జనసేనకు కేటాయించడంతో టిడిపి సీనియర్ నాయకులు బండారు సత్యనారాయణమూర్తి మనస్తాపం చెందారు. ప్రజాగళం యాత్రకు ఇటీవల జిల్లాకు వచ్చిన చంద్రబాబు బండారును బుజ్జగించే ప్రయత్నం చేశారు. భవిష్యత్‌లో మంచి గౌరవం ఇస్తామని బాబు హామీ ఇచ్చినా ఆయన ఇంటి నుంచి కదలలేదు. బండారు బయటకు రాకపోవడంతో ఆయన అనుచరులు ఎన్నికల్లో పనిచేయడానికి ఆసక్తిచూపలేదు. ఇది తనకు నష్టమని భావించిన సిఎం రమేష్ రంగంలోకి దిగారు. పెందుర్తి జనసేన అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబును మార్చడం తన వల్లకాక మాడుగుల టిడిపి అభ్యర్థి పైలా ప్రసాదరావును తప్పించి ఆ టికెట్ బండారుకు కేటాయించేలా చంద్రబాబును ఒప్పించడంలో రమేష్ సూత్రధారి అన్న ప్రచారం బలంగా సాగుతోంది.

మాడుగుల నియోజకవర్గ టికెట్ రాని మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు స్వతంత్ర అభ్యర్థిగా బరిలో వుంటే తనకు నష్టమని భావించిన సిఎం రమేష్ రెండు నియోజకవర్గాల్లో తన పట్టు పెంచుకొనేందుకు పావులు కదిపారు. పైలాను మార్చితే బండారుకు సహకరిస్తానని గవిరెడ్డి చెప్పడంతో, గవిరెడ్డి పోటీలో లేకుండా పైలా బదులు బండారుకు టికెట్ ఇప్పించారు. పెందుర్తి టికెట్ రాక అసంతృప్తితో వున్న బండారుకు మాడుగుల టికెట్ ఇప్పించి, పెందుర్తి మిగతా 2లో..

అక్కయ్యపాలెం వద్ద ప్రజలకు అభివాదం చేస్తున్న సిఎం జగన్

ప్రజలకు అభివాదం చేస్తూ..

మౌనంగా సాగిన జగన్ బస్సు యాత్ర

సిఎం మాట్లాడకపోవడంతో పలువురిలో నిరాశ

విశాఖ నగరంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదివారం నిర్వహించిన 'సిద్ధం బస్సు యాత్ర' ప్రజలకు అభివాదం చేస్తూ మౌనంగానే ముందుకు సాగింది. జనం పెద్ద సంఖ్యలో హాజరైనప్పటికీ ఎక్కడా జగన్ ప్రసంగించలేదు. హనుమంతువాక, ఎండాడ వంటి చోట్ల జనం జగన్ మాట్లాడతారని ఆశించారు. తొలుత ఆయన పెందుర్తి మండలం మీదుగా గోపాలపట్నంలోకి అడుగుపెట్టారు. ఎన్ఎడి, దుర్గాలమ్మ గుడి, మర్రిపాలెం, ఐటిఐ జంక్షన్, ఊర్వశి మీదుగా కంచరపాలెం వరకూ రోడ్ షో సాగింది. సాయంత్రం సత్యం జంక్షన్, మద్దిలపాలెం, వెంకోజీపాలెం, హనుమంతవాక తదితర చోట్ల జగన్ యాత్ర సాగినా ఆయన నోరు మెదపలేదు. విశాఖ స్టీల్‌ప్లాంట్, పంచగ్రామాల సమస్యలపై ఆయన మాట్లాడకపోవడం విమర్శలకు తావిస్తోంది.

(ప్రధాన వార్త మెయిన్‌లో..)

కత్తితో గొంతు కోసుకొని వివాహిత ఆత్మహత్య

వార్త 2లో..

బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దింపాలి : లోకనాథం

వార్త 6లో..

పాడేరులో కూటమి అభ్యర్థి మార్పు

వార్త 8లో..

వర్క్‌షాప్‌లో సందడి చేస్తున్న విద్యార్థులు

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

సందడిగా సాగిన విసిసి సమ్మర్ క్యాంపు కార్యశాల వార్త 2లో..

పాలకులపై 'ఉక్కు' మహా గర్జన

- కూర్మన్నపాలెం కూడలిలో భారీ ధర్నా
- స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ అంశాన్ని రాజకీయ పార్టీలు మ్యానిఫెస్టోలో పెట్టాలని డిమాండ్

ప్రజాశక్తి - ఉక్కునగరం : ప్రతి రాజకీయ పార్టీ విశాఖ ఉక్కు పరిరక్షణ అంశాన్ని మ్యానిఫెస్టోలో పెట్టాలని డిమాండ్ చేస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద ఉక్కు మహా గర్జన పేరిట ఆదివారం ధర్నా నిర్వహించారు. తొలుత పోరాట కమిటీ ఛైర్మన్, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడారు. మూడేళ్లుగా స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం పోరాటం చేస్తుంటే పట్టించుకోని కేంద్ర బిజెపి నాయకులు నేడు అబద్ధాలతో మోసపుచ్చేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. పోరాట కమిటీ ఛైర్మన్లు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాల వల్లే విశాఖ ఉక్కు కర్మాగారం నేడు సమస్యలు మిగతా 2లో..

ఉక్కు మహా గర్జన ధర్నాలో మాట్లాడుతున్న సిహెచ్.నర్సింగరావు

మొదటి పేజీ తరువాయి..

టిడిపిలో బిజెపి రమేష్ చక్రం

నియోజకవర్గంలో ఆయన అనుచరులంతా తనకు సహకరించేలా చేసుకోగలిగారు. ఎంపీగా గెలవడానికి సిఎం రమేష్ టిడిపిలో చిచ్చు పెడుతున్నారు. ఇప్పటికే పైలా ప్రసాదరావు రాజకీయంగా నష్టపోయారు. ఎమ్మెల్యే టికెట్ తెచ్చుకోగలిగానన్న సంతృప్తి తప్ప మాడుగుల నుంచి గెలవడం బండారుకు అంత సులభం కాదని పలువురు చెబుతున్నారు. స్థానికేతరుడన్న ముద్ర సిఎం రమేష్‌కు వున్నట్లే బండారుకూ వుంది. అది మున్ముందు తలనొప్పి తెప్పించే అవకాశముంది.

మాడుగుల నుంచి బండారు విజయం సాధ్యంకాదని రమేష్‌కు తెలిసినా.. ఆయనను సంతృప్తిపర్చడం ద్వారా పెందుర్తి నియోజకవర్గంలోని ఆయన అనుచరులు, మాడుగుల నియోజకవర్గంలో బండారుకు సహకరించే గవిరెడ్డి, పివిజి.కుమార్ మద్దతు తాను పొందేలా టిడిపిని రమేష్ ఉపయోగించుకోగలుగుతున్నారు. మాడుగుల నుంచి బి.ఫారం బండారుకు చంద్రబాబు ఇవ్వడంతో పైలాకు ఇంతవరకు వున్న కొద్దిపాటి ఆశ చల్లారిపోయినట్లయింది. తనకు టికెట్ పోవడానికి సిఎం రమేష్ కారణమని పైలా బహిరంగంగా కొద్ది రోజుల క్రితం విమర్శించారు. కడప రాజకీయాలు ఇక్కడ చేయొద్దని, పైలాను ఇంతవరకు ఒక వైపు చూశారని, ఇకనుంచి రెండోవైపు చూస్తారని ఆయన చెప్పుకొచ్చారు. ఆయన ఆగ్రహం చూస్తుంటే స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తారన్న చర్చ జరుగుతోంది. పైలాకు చంద్రబాబు, సిఎం.రమేష్ తీరని అన్యాయం చేశారన్న అభిప్రాయం టిడిపి నాయకత్వంలో కొందరికి వుంది.

పాలకులపై 'ఉక్కు' మహా గర్జన

ఎదుర్కొంటోందని అన్నారు. జివిఎంసి 78వ వార్డు ఉక్కునగరం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ ప్రభుత్వాలపై కార్మిక వర్గం ఐక్యంగా పోరాటాలు చేయడం ద్వారానే ప్రభుత్వ విధానాలు మారుతాయని స్పష్టం చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక వర్గంపై చేస్తున్న దాడిని ప్రతిఘటించడానికి ఇదే సరైన సమయమని అన్నారు. కర్మాగారాన్ని కాపాడుకుంటామని తమ ఓటు హక్కు ద్వారా ప్రజలు పాలకులకు తెలియజేయాలన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కన్వీనర్ కెయస్ఎన్.రావు, కో - కన్వీనర్లు నీరుకొండ రామ చంద్రరావు, జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు సహకరిస్తున్న స్థానిక స్టీల్ యాజమాన్యం ప్రణాళికబద్ధంగా ప్లాంట్‌ను నాశనం చేస్తోందని మండిపడ్డారు. విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఛైర్మన్ ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద జెఎసి ఆధ్వర్యంలో జరుగుతున్న పోరాటం తీరుతెన్నులను వివరించారు. ఆ శిబిరానికి విశేష మద్దతు దక్కుతోందని అన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకునే వరకూ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ప్రతినిధులు యు.రామస్వామి, మసేన్‌రావు, కారు రమణ, డివి.రమణారెడ్డి, వరసాల శ్రీనివాస్, డి.సురేష్ బాబు, పరంధామయ్య, కరణం సత్యారావు, శ్రీనివాసులు నాయుడు, నమ్మి సింహాద్రి, ఆడారి అప్పారావు, స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తౌడన్న, మల్లయ్య, ఒబిసి అసోసియేషన్ అధ్యక్షులు బి.అప్పారావు, వి.ప్రసాద్, పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఆశ్రమ పాఠశాల ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి- రంపచోడవరం: చింతూరు, రంపచోడవరం ఐటిడిఎల పరిధిలోని గిరిజన సంక్షేమ గురుకుల బాలురు, బాలికల పాఠశాలలో 5వ తరగతి ప్రవేశాలకు, 6,7,8,9 తరగతుల్లో ఖాళీగానున్న సీట్ల భర్తీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఆదివారం ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా నిర్వహించారు. 5వ తరగతి ప్రవేశానికి 735 మంది దరఖాస్తు చేసుకోగా, ప్రవేశపరీక్షకు 608 మంది హాజరయ్యారు 6వ తరగతిలో 454 మందికిగాను 316 మంది, 7వ తరగతి 48 మందికి 39 మంది, 8వ తరగతి 54 మందికి 39 మంది, 9వ తరగతి 24 మందికి 17 మంది చొప్పున మొత్తం 1315 మంది దరఖాస్తు చేసుకోగా 1013 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరైనట్లు గురుకుల పాఠశాలల కన్వీనర్ ప్రిన్సిపల్ యస్‌కె.అహ్మద్ అలిషా తెలిపారు.

అడ్డతీగల : గిరిజన సంక్షేమ గురుకులాల్లో ప్రవేశానికి ఆదివారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా సాగింది.మండల కేంద్రంలో గల గురుకులం పాఠశాలలో ప్రవేశ పరీక్షను ప్రిన్సిపల్ కెవి హరినాధరావు, చీఫ్ సూపర్డెంట్ పిఎస్ఆర్ ఆంజనేయులు పర్యవేక్షించారు. 5వ తరగతిలో 175 మందికిగాను 130 మంది హాజరు కాగా, 6 వతరగతిలో 81మందికి 57 మంది హాజరయ్యారు పరీక్ష కేంద్రంలో 277మందికి గాను 205 మంది హాజరు అయ్యారని 72 మంది గైర్హాజరైనట్లు ప్రిన్సిపల్ తెలిపారు. హాజరు కాలేదని ప్రిన్సిపాల్ తెలిపారు. ప్రతిభ ఆధారంగా అర్హులకు ప్రవేశాలకు ఎంపిక చేస్తారన్నారు.

అమరుల స్ఫూర్తితో భవిష్యత్ పోరాటం

ప్రజాశక్తి- చింతూరు: అమరుల స్ఫూర్తితో భవిష్యత్ పోరాటం కొనసాగించాలని ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం యుటిఎఫ్ ఉద్యమ నిర్మాతల్లో ముఖ్యులైన అప్పారి వెంకటస్వామి, వత్సవాయి సూర్య నారాయణ రాజు వర్ధంతి సభను యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చింతూరులో నిర్వహించారు. ముందుగా అమరజీవుల చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పి.కృష్ణయ్య అధ్యక్షత వహించిన సభలో ఎమ్మెల్సీ ఐ. వెంకటేశ్వరరావు స్మారకోపన్యాసం చేస్తూ, దారి తెన్నూలేని పరిస్థితుల్లో ఉన్న నాటి విద్యావ్యవస్థలోఉపాధ్యాయ ఉద్యమాన్ని నిర్మించారని గుర్తు చేశారు. ఉపాధ్యాయులకు అనేక సౌకర్యాలను తెచ్చిపెట్టిన వారిలో ఆద్యులు అప్పారి, వత్సవాయిలు అని కొనియాడారు. నేడు.ఉపాధ్యాయులపై తీవ్ర ఒత్తిడులు పెంచి, నాణ్యమైన విద్యను పేద పిల్లలకు దూరం చేసే పనిలో ప్రభుత్వాలు ఉన్నాయని ఆరోపించారు. అమరజీవుల స్ఫూర్తితో మన భవిష్యత్ కోసం పోరాటాలు కొనసాగిద్దామని సూచించారు. ఉపాధ్యాయులు వర్ధంతి సభలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు వై. విల్సన్ బాబు, జిల్లా కార్యదర్శులు కె. ఆదిరెడ్డి, ఎస్. నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

సందడిగా సాగిన విసిసి సమ్మర్ క్యాంపు కార్యశాల

ప్రజాశక్తి - మాధవధార : వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ (విసిసి) - 2024 సమ్మర్ క్యాంపు వర్క్‌షాపు ఆదివారం కంచరపాలెంలోని బిఎన్ఆర్ ఫౌండేషన్‌లో ఉత్సాహంగా సాగింది. కార్యక్రమాన్ని ఆసరా ఛారిటబుల్ సొసైటీ మెంబర్ శ్రీనాథ్ ప్రారంభించారు. ఈ వర్క్‌షాపునకు హాజరైనవారు పలు విషయాలను నేర్చుకుని, వారి ఏరియాలకు వెళ్లి అక్కడి పిల్లలకు నేర్పించాలన్నారు. ఈ వర్క్ షాప్‌లో సెల్ఫ్ డిఫెన్స్‌ను యోగా టీచర్ సరోజా నేర్పించారు. పాటల్లో మౌనిక, తులసి మెళకువలు తెలిపారు. డ్యాన్సులను హరిత, తేజ, క్రాఫ్ట్‌ను సంధ్య, టీమ్ గేమ్స్‌ను రజని నేర్పించారు. పాడించడం, నేర్పడం. బొమ్మలు వేయించడం, నేర్పడం, చిన్న చిన్న ఏకపాత్రలు, మైమ్ మొదలైనవి ఈ వర్క్‌షాపులో నేర్పారు. పాటలకు ఎలా నృత్యం చేయాలో తెలిపారు. బొమ్మలు ఉన్న కథల పుస్తకాలను ఇచ్చి చదివించడం, చదివిన కథను చెప్పించడం. ఓరిగామి, చిన్న చిన్న ప్రయోగాలను చేయించడం ఈ కార్యశాలలో సాగింది. సమిష్టితత్వం ప్రాధాన్యతను వివరించారు. ఊహాశక్తిని పిల్లలలో పెంపొందించే విధంగా ఈ కార్యశాల సాగింది. 'వేసవి సెలవులు పిల్లలకు ఒక ఆటవిడుపు కావాలి. మరచిపోలేని జ్ఞాపకం కావాలి' అని విసిసి వ్యవస్థాపకులు డాక్టర్ కె.రమాప్రభ అన్నారు. ఈ సంవత్సరం 125 చోట్ల విశాఖ జిల్లాలో, 40 చోట్ల అల్లూరి సీతారామరాజు జిల్లాలో సమ్మర్ క్యాంపులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వీటికి ఆసరా చారిటబుల్ సొసైటీ, గౌతు లచ్చన్న ఆర్గనైజేషన్ ఫర్ వీకర్ సెక్షన్స్ సహకారం అందిస్తున్నాయన్నారు. ఇటువంటి క్యాంపుల నిర్వహణ కోసం, ఇతర సమాచారం కోసం 8309812422, 9392993742 నెంబర్లను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో విసిసి జోన్ సభ్యులు అప్పారావు, కృష్ణారావు, పుష్ప, మణి, కల్యాణి, భవాని, వసంత, పుష్ప, హారిక, వర్షిణి, మౌనిక, స్వర్ణ, తులసి పాల్గొన్నారు.

వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న రమాప్రభ

జగన్ బస్సు యాత్రతో నిలిచిపోయిన వాహనాలు

సిద్ధం బస్సు యాత్రతో.. ప్రజలకు ఇక్కట్లు

విశాఖ నగరంలో సిఎం జగన్మోహన్ రెడ్డి ఆదివారం చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్రతో ప్రజలు ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సిఎం యాత్ర నేపథ్యంలో పలు మార్గాలను పోలీసులు భద్రత దృష్ట్యా మూసివేశారు. కంచరపాలెం, ఎన్ఎడి కొత్త రోడ్డు, అక్కయ్యపాలెం ప్రాంతాల్లో జగన్ పర్యటన సాగుతున్నప్పుడు వందలాది మంది ఇబ్బందిపడ్డారు. అత్యవసర పనుల మీద వెళ్తున్న వారు విసుక్కున్నారు.

ట్రాఫిక్‌లో చిక్కుకున్న అంబులెన్స్

తాడుతో జన రాకపోకలను అడ్డుకున్న పోలీసులు

కత్తితో గొంతు కోసుకొని వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి - అనకాపల్లి

అనకాపల్లి జిల్లా కేంద్రంలోని కొత్తూరు మేజర్ పంచాయతీ ముదిరాజ్ కాలనీలో శనివారం రాత్రి కత్తితో గొంతు కోసుకుని వివాహిత బలవన్మరణానికి పాల్పడిన ఘటన ఆ ప్రాంతంలో కలకలం రేపింది. అనకాపల్లి పట్టణ ఎస్ఐ సత్యనారాయణ అందించిన వివరాల ప్రకారం, కొత్తూరు పంచాయతీ ముదిరాజ్ కాలనీకి చెందిన గుత్తికొండ ఉమాదేవి విజయనగరం జిల్లాలో ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో కాంట్రాక్టు అధ్యాపకురాలిగా పనిచేస్తున్నారు. 2011లో వివాహమైనప్పటికీ ఏడాది కాలంలోనే భర్త నుంచి వేరుపడి, జీవనం సాగిస్తోంది. ఈ నేపథ్యంలో కొంతకాలంగా తీవ్ర మనస్తాపంతో ఉన్న ఆమె శనివారం రాత్రి కత్తితో గొంతు కోసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమె మృతి పలువురిని కలచివేసింది. ఇదిలా ఉండగా భర్త వేధింపుల కారణంగానే తన కుమార్తె బలవన్మరణానికి పాల్పడిందని మృతురాలు ఉమాదేవి తండ్రి స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

ఉమాదేవి (ఫైల్‌ఫోటో)

మృతదేహానికి ఎన్‌టిఆర్ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్టు పట్టణ ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వైసిపిలో చేరికలు...

ప్రజాశక్తి -యంత్రాంగం

తగరపువలస : వైసిపి భీమిలి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు సమక్షంలో జివిఎంసి 2, 3 వార్డులకు చెందిన పలువురు టిడిపి, జనసేన నాయకులు, పలువురు మాజీ సైనికులు ఆదివారం వైసిపిలో చేరారు. వారికి ముత్తంశెట్టి శ్రీనివాసరావు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఉవరు ఎన్ని కుట్రలు పన్నినా సరే భీమిలిలో వైసిపి విజయం తథ్యమని జోస్యం చెప్పారు. భీమిలి క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎస్.కరుణాకరరెడ్డి, బి.హరికిరణ్‌రెడ్డి, సిహెచ్.భాస్కరరెడ్డి, అల్లిపిల్లి నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

వైసిపిలో చేరిన ఆలివర్ రాయి

భీమునిపట్నం : స్థానిక కేథరిన్ విద్యా సంస్థల డైరెక్టర్, ఎపి, తెలంగాణ ఎఫ్‌సిఆర్‌ఎ ఎన్‌జిఒస్ ఛైర్మన్, ఎపి క్రిస్టియన్ లీడర్స్ ఫోరం ఛైర్మన్ ఆలివర్ రాయి ఆదివారం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సమక్షంలో వైసిపిలో చేరారు. వైసిపి కండువా కప్పి పార్టీలోకి ముఖ్యమంత్రి ఆహ్వానించారు. వైసిపిలో చేరిన ఆలివర్‌రాయి ముందు జనసేనలో ఉండేవారు.

విశాఖ కలెక్టరేట్ : దక్షిణ నియోజకవర్గానికి చెందిన జనసేన సీనియర్ నాయకులు గంపల గిరిధర్, డాక్టర్ మూగి శ్రీనివాసరావు ఆదివారం నగరానికి వచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సమక్షంలో వైసిపిలో చేరారు. వీరి చేరిక దక్షిణంలో జనసేన పార్టీకి పెద్ద దెబ్బగా పరిశీలకులు భావిస్తున్నారు. గంపల గిరిధర్ 2019 ఎన్నికలలో దక్షిణ నియోజవర్గం వచ్చి జనసేన పార్టీ తరవున పోటీ చేసి 18 వేలకుపైగా ఓట్లు సాధించారు. ఆయన మత్స్యకార సామాజిక తరగతికి చెందినవారు. అలాగే డాక్టర్ మూగి శ్రీనివాసరావు జనసేన పార్టీ ప్రారంభం నుంచి పని చేస్తున్నారు. వీరితో పాటు జనసేనలో చేరిన వారిలో జి.శ్రీజ, జి.ధనుష్ ఉన్నారు.

సిఎం జగన్ సమక్షంలో వైసిపిలో చేరిన ఆలివర్‌రాయి

ఘనంగా ఎన్ఎస్ఆర్ఐటి వార్షికోత్సవం

వార్షికోత్సవంలో మాట్లాడుతున్న అతిథి

ప్రజాశక్తి-ఆనందపురం: మండలంలోని శొంఠ్యాం నడింపల్లి సత్యనారాయణరాజు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఎస్ఆర్ఐటి) 13వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐఐటి (ఢిల్లీ) మాజీ ప్రొఫెసర్ డాక్టర్ రాజ్నాల్ దహియా హాజరయ్యారు. డాక్టర్ దహియా తన అనుభవాన్ని, విజ్ఞానాన్ని వివరించారు. జెఎన్‌టియు జివి రిజిస్టర్ డాక్టర్ జిజె.సుమ సాంకేతిక విద్య, అభివృద్ధి చెందుతున్న ప్రకృతి దృశ్యంపై వివరించారు. అకడమిక్స్, పాఠ్యేతర కార్యకలాపాలలో ఎలా రాణించాలో వివరించారు. టిలిచో ల్యాబ్స్ సిఇఒ కిరణ్ మాట్లాడుతూ, నైపుణ్యంతో ప్రేక్షకులను ప్రేరేపించడం, కెరీర్లో స్థిరపడటానికి మార్గదర్శకత్వం అందించారు. ప్రిన్సిపల్ ఎస్.శంభుప్రసాద్ మాట్లాడుతూ, సంవత్సరం పొడవునా క్యాంపస్ కమ్యూనిటీలో స్నేహం, చేరిక, స్ఫూర్తిని పెంపొందిస్తూ అనేక ఈవెంట్లను నిర్వహించామన్నారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు, అనేక వర్క్ షాపులు నిర్వహించామని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ ఎన్.సత్యనారాయణరాజు, కార్యదర్శి డాక్టర్ ఎన్.ప్రసాదరాజు, కోశాధికారి ఎన్.కనకరాజు, డైరెక్టర్ జె.రాజా మురుగదాస్, అన్ని విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వాడవాడలా ముత్తంశెట్టి ప్రచారం

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి 5, 7 వార్డుల పరిధిలో వైసిపి నాయకులు ఆదివారం ముమ్మర ప్రచారం చేపట్టారు. ఆయా వార్డుల్లోని అపార్ట్‌మెంట్లు, హరిత వ్యాలీలో భీమిలి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు గడపగడపకు తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. కాలనీవాసులతో సమావేశం నిర్వహించి వైసిపికి ఓటువేయాలని అభ్యర్థించారు. ఎన్నికల సమయంలో వచ్చిన నాయకుడు కావాలా, నిత్యం ప్రజల్లో ఉండే నాయకుడు కావాలా అన్నది ఓటర్లు ఆలోచించాలని కోరారు. 2019లో గెలిచిన తర్వాత భీమిలిలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టానని తెలిపారు. మరోసారి ప్రజలు అవకాశం కల్పిస్తే మరింత అభివృద్ధి చేస్తానని చెప్పారు.

సమావేశంలో మాట్లాడుతున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు

'వైసిపి పాలనలో గ్రామగ్రామానికీ మద్యం'

ప్రజాశక్తి-సీతమ్మధార : సంపూర్ణ మద్యపాన నిషేధం చేస్తానని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి పరిపూర్ణంగా గ్రామ గ్రామానికి మద్యాన్ని విస్తరించారని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ఆరోపించారు. పౌర గ్రంథాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మద్యంతో వేల మంది అమాయక ప్రజల ప్రాణాలు తీశారన్నారు. గంజాయిని పెంచి పోషించారని విమర్శించారు. ఉత్తరాంధ్రకు వచ్చి ఓటు అడిగే హక్కు జగన్మోహన్‌రెడ్డికి లేదన్నారు. ఒక బస్ బేను సరిగ్గా నిర్మించలేని, ఫ్లోటింగ్ బ్రిడ్జిని సరిగ్గా కట్టలేని ఈ ముఖ్యమంత్రి విశాఖపట్నాన్ని సుందర నగరంగా తీర్చిదిద్దుతారా అని ప్రశ్నించారు. విశాఖను కార్యనిర్వాహక రాజధాని చేస్తామని చెప్పి ఇక్కడి ప్రభుత్వ, ప్రయివేటు ఆస్తులను, ప్రకృతి వనరులను దోచుకున్నారని ఆరోపించారు. జగన్ బాబా టీం సభ్యులైన విజయసాయిరెడ్డి, వైవి.సుబ్బారెడ్డి, ఎంవివి సత్యనారాయణ తదితరులు ఒక్క విశాఖలోనే 30 వేల కోట్ల రూపాయలకు పైగా ఆస్తులను భయపెట్టి, బెదిరించి, తప్పుడు పత్రాలు సృష్టించి హస్తగతం చేసుకొన్నారని విమర్శించారు. ఈ సమావేశంలో జనసేన చోడవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎస్ఎన్ రాజు పాల్గొన్నారు.

రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ఉచిత హోమియో వైద్యశిబిరం

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక కలిగొట్ల స్విర్ల శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యాన చిన్న బజారులో ఉన్న ఫౌండేషన్ కార్యాలయం వద్ద ఆదివారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు వంద మందికి వైద్యులు టి.జగన్నాథరావు, టిజె.మోహన్ వైద్య పరీక్షలు జరిపి మందులు పంపిణీ చేశారు. ముందుగా వైద్య శిబిరాన్ని ఫౌండేషన్ ఛైర్మన్ కె.శ్రీరామచంద్రమూర్తి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు కెఎస్ఎన్ మూర్తి, కె.చంద్రశేఖర్, కెవి.భానోజీ రావు, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సామూహిక ఉపనయనం

ప్రజాశక్తి-సీతమ్మధార : విశాఖ జిల్లా కళింగవైశ్య యువజన చైతన్య సేవా సంఘం ఆధ్వర్యాన సింహాచలం మారుతీ కల్యాణ మండపంలో సామూహిక ఉపనయన బ్రహ్మోపదేశ మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉత్తర నియోజకవర్గం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు హాజరై మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించారన్నారు. ఈ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైసిపిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సప్పంగి శ్రీను, చంద్రమౌళి, లంకా భాస్కరరావు, సాయి, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

నేడు కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి నామినేషన్

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి అడ్డాల వెంకటవర్మరాజు (హాసినివర్మ) సోమవారం భీమిలి ఆర్‌డిఒ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భీమిలి మండలం తాళ్లవలస నుంచి తగరపువలస మీదుగా భీమిలి ప్రభుత్వాసుపత్రి వరకు ర్యాలీగా వెళ్లి నామినేషన్ వేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఇండియా వేదిక నాయకులకు, కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు.

నేరాలు ఘోరాలు

మతి స్థిమితం లేని వ్యక్తి మృతి

ప్రజాశక్తి -మధురవాడ : పోతినమల్లయ్యపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం మతి స్థిమితం లేని వ్యక్తి మృతి చెందినట్లు పిఎం.పాలెం సిఐ వై.రామకృష్ణ తెలిపారు. మహారాష్ట్ర జల్గావ్ జిల్లాకు చెందిన రోహిత్ శంకర్ భవిష్కర్ (40) మారికవలస ఐటి సెజ్ రోడ్డులో ఉన్న నారాయణ ఐఐటి కళాశాల వద్ద మెట్లపై పడి మృతి చెందాడు. మృతుని తండ్రి సమాచారం మేరకు రోహిత్ శంకర్‌కు మతిస్థిమితం లేదని సిఐ తెలిపారు. స్థానిక విఆర్ఒ పూర్ణ సాయి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని కెజిహెచ్‌కు తరలించారు.

యువతి అదృశ్యం

ప్రజాశక్తి -మధురవాడ : పోతిన మల్లయ్యపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని యువతి అదృశ్యమైనట్లు సిఐ వై.రామకృష్ణ తెలిపారు. ఆనందపురం మండలం బోయపాలెం దరి కళ్లివానిపాలెంలో మీసాల రమణ కుటుంబ సభ్యులతో నివాసముంటున్నాడు. మీసాల రమణకు కుమార్తె లీలావతి ఉంది. ఇంటర్మీడియట్ పూర్తి చేసి ఇంట్లోనే ఉంటుంది. శనివారం ఉదయం షాపింగ్ అని చెప్పి మరో మహిళతో కలిసి లీలావతి బోయపాలెం కూడలి వద్ద బస్సు ఎక్కి వెళ్లింది. మార్గమధ్యంలో ఆ మహిళ వద్ద ఫోన్ తీసుకొని కొమ్మాది కూడలి వద్ద బస్సు దిగి ఎటు వెళ్లిందో తెలియలేదు. అప్పటినుంచి బంధువులు ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లేకపోవడంతో ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సిఐ తెలిపారు.



గంటా సమక్షంలో టిడిపిలో చేరిన మహంతి వెంకటలక్ష్మి, శివాజీ తదితరులు

టిడిపిలో చేరిక

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం కుసులవాడ పంచాయతీ సర్పంచ్ మహంతి వెంకటలక్ష్మి, శివాజీతో పాటు పది వార్డుల మెంబర్లు గంటా సమక్షంలో టిడిపిలో చేరారు. తెలుగుదేశం పార్టీ భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు, కుసులవాడ గ్రామ పంచాయతీ పార్టీ ప్రెసిడెంట్ ఎస్.లక్ష్మణరావు ఆధ్వర్యాన ఆదివారం వారంతా పార్టీలో చేరారు. వారికి కూటమి అభ్యర్థి గంటా శ్రీనివాసరావు టిడిపి కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టిడిపిలో చేరిన వారిలో కుసులువాడ గ్రామ సర్పంచ్ మహంతి వెంకట లక్ష్మీశివాజీ, ఉప సర్పంచ్, అల్లి రామారావు, వార్డుల మెంబర్లు తామరోతు లక్ష్మి, కోరాడ పైడిరాజు, చింతాడ వెంకట సూర్యనారాయణ, రవ్వ లక్ష్మి, పిల్లా పార్వతి, ఈగల వెంకటరమణ, రేగాని రాము, రేగాని అప్పలనాయుడు, వరపుల గౌరీతో పాటు పంచాయతీలో వైసిపికి చెందిన సీనియర్ నాయకులు, ముఖ్య అనుచరులు ఎంవిపి కాలనీలోని గంటా శ్రీనివాసరావు నివాసంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో భీమిలి జెడ్‌పిటిసి గాడు వెంకటప్పుడు, గ్రామపంచాయతీ పార్టీ ప్రెసిడెంట్ ఎస్.లక్ష్మణరావు, రేగాని ఆదినారాయణ, కృష్ణంరాజు పాల్గొన్నారు.

పల్లాకు బి.ఫారం

ప్రజాశక్తి-గాజువాక: టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ఆదివారం తమ పార్టీ అభ్యర్థులకు బి ఫారాలు అందజేశారు. కూటమి గాజువాక అభ్యర్థిగా బరిలోకి దిగిన పల్లా శ్రీనివాసరావుకు చంద్రబాబు బి ఫారం అందజేశారు. తనను ఆదరించి, ఆశీర్వదిస్తున్న గాజువాక ప్రజల వెన్నంటి నిలిచి, నియోజకవర్గ అభివృద్ధి కోసం పాటుపడతానని గాజువాక నియోజకవర్గానికి పల్లా శ్రీనివాసరావు హామీ ఇచ్చారు.

బి ఫారం అందుకుంటున్న పల్లా శ్రీనివాసరావు

ప్రజాశక్తి
www.prajasakti.com
విశాఖ, అనకాపల్లి
సోమవారం
22 ఏప్రిల్ 2024

కలం మాట

యువతా.. భవిష్యత్ చక్కదిద్దుకో..!

ఓటు వేయుట నీ జన్మ హక్కని...
నేతల తలరాతను మార్చేది
నీ ఓటేనన్నది మరువకు నేస్తం,
ధనం కన్నా ఓటు మిన్నని తెలుసుకో
నిలకడలేని నాయకత్వం కన్నా
నమ్మకమైన ఓటరే మిన్నన్నది మరువకు,
ప్రగల్భాలు పలికే నాయకులు కన్నా
నిస్వార్థ ప్రజాసేవకులే మిన్న,
చెద పట్టిన దేశ స్థితి
నిరుద్యోగ యువత దుస్థితి
దృష్టినందుంచుకొని
నీ ఓటు వేసే ముందు
క్షణం, ఒక్క క్షణం,
చించి, యోచించి, కీడెంచి,
చెద పురుగులను వెలికి తీసి
సుస్థిర దేశాన్ని ప్రతిష్టించుకో,
నవతర యువత భవిత కూడా
నీదేనన్నది మరువకు,
నీ తలరాతను నువ్వే మార్చుకో...
యువతా..
ఇకనైనా నీ తలరాతను మార్చుకో,
నీ భవితను చక్కదిద్దుకో,
ఓటంటే నోటు కాదని తెలుసుకో,
ఓటే నీ ఉజ్వల భవితయని,
ఓటంటే దానం చేయుట కాదని,

– రాయవరపు సరస్వతి,
కవయిత్రి, కోటవీధి, చోడవరం

జగన్‌కు మరో ఛాన్సిస్తే
రాష్ట్రం అధోగతి!

ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి గంగాధర్

ప్రజాశక్తి-అనకాపల్లి : ఒక్క ఛాన్స్ అంటూ ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన సిఎం జగన్ రాష్ట్రాన్ని అధోగతి పాల్జేశారని ఇండియా వేదిక బలపరచిన అనకాపల్లి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఐఆర్. గంగాధర్ ఆరోపించారు. ఆదివారం మండలంలోని కృష్ణాపురం కాలనీలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలోనూ కేంద్రంలోనూ ఇండియా వేదిక అధికారంలోకి తీసుకు రావాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విభజన హామీల అమలు, రాష్ట్రానికి రావాల్సిన నిధులను రప్పించడంలో సీఎం జగన్ పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు.

రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చి రుణాంధ్ర ప్రదేశ్‌ను చేశారని ఎద్దేవా చేశారు. అభివృద్ధికి ఆస్కారం లేకుండా రాష్ట్రాన్ని నాశనం చేశారన్నారు. కొత్త పరిశ్రమలు తీసుకు రావడంలో జగన్ పూర్తిగా విఫలమైనా రన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువత కన్నీరు పెడుతుంటే, ఎన్నికలకు ముందు దగా డిఎస్‌సిని తీసుకొచ్చి, మరోమారు నిరుద్యోగులను నయవంచనకు గురిచేశారని గంగాధర్ మండిపడ్డారు. కార్యక్రమంలో డిసిసికార్యదర్శి ఎగ్గాడ భాస్కరరావు, కశింకోట, అనకాపల్లి మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు సనేడ గజ్జాలు, దాసరి సంతోష్, కాంగ్రెస్ ప్రొఫెషనల్ రాష్ట్ర కోఆర్డినేటర్, యువ న్యాయవాది అవినాష్ ఇళ్ళ, జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకులు కొల్లి సత్యారావు, కోశెట్టి బుజ్జి, మేడిశెట్టి సత్తిబాబు, నందికి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

సార్వత్రిక సంగ్రామం

మహిళా ఓటర్లు, ఓటింగ్ చైతన్యం ఎక్కువగా ఉన్న విశాఖ జిల్లాలో చట్టసభల్లో మహిళలకు ఆశించిన స్థాయిలో అవకాశాలు దక్కడం లేదనేది వాస్తవం. ఉమ్మడి విశాఖలో 15 అసెంబ్లీ స్థానాలుంటే, ఆరు స్థానాల్లోనే మహిళా ప్రాతినిధ్యం ఉంది. పలువురు ఎమ్మెల్యేలుగా ఎన్నికైనా మంత్రి పదవి మాత్రం ఒకే ఒక్కరిని వరించింది. తెలుగుదేశం హయాంలో 1999లో పాడేరు ఎమ్మెల్యేగా ఎన్నికైన ఎం.మణికుమారి ఈ ఘనత సాధించారు. మహిళా సాధికారిత, రాజకీయాల్లో మహిళలకు సమప్రాధాన్యం అంటూ ఊదరగొడుతున్న రాజకీయపార్టీలకు, అదే మహిళలకు మంత్రులుగా సరైన అవకాశాలు కల్పించకపోవడం శోచనీయం.

(ప్రజాశక్తి- కలెక్టరేట్)

పాత జ్ఞాపకం

ఉమ్మడి విశాఖలో
ఒక్కరే మహిళా మంత్రి!

- 1999లో అమాత్య పదవిని అధిష్టించిన మణికుమారి
- మహిళలకు టిక్కెట్లు, పదవుల కేటాయింపులో ప్రధాన పార్టీల చిన్నచూపు

రాష్ట్రంలో ప్రత్యేకత కలిగిన ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి ఇప్పటివరకు రాష్ట్రమంత్రిగా ఒకే ఒక్క మహిళ వ్యవహరించారంటే ఆశ్చర్యం, విస్మయం కలుగుతోంది కదూ..! కానీ ఇది నిజం. ఉమ్మడి విశాఖ జిల్లాలో 15 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నప్పటికీ, ఇంతవరకు ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి మాత్రమే మహిళలు పోటీ చేశారు. అందులో ఒకే ఒక్కరు మాత్రమే మంత్రి పదవిని అలంకరించారు. ఆమె మత్స్యరాస.మణికుమారి. ఉమ్మడి జిల్లాలో 1983 తర్వాతే ఎన్నికల బరిలో మహిళా అభ్యర్థులు ఎక్కువగా పోటీకి దిగడం మొదలైంది. పాడేరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 1999 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తరపున పోటీ చేసి విజయం సాధించిన మణికుమారి మాత్రమే ఇప్పటివరకు విశాఖ జిల్లా నుంచి రాష్ట్రమంత్రిగా వ్యవహరించారు. 1952 నుంచి జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల తీరుతెన్నులను పరిశీలిస్తే, 1967 1972 ఎన్నికలలో కాంగ్రెస్ తరపున మాడుగుల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన రమాకుమారి దేవి, బొడ్డు కళావతి విజయం సాధించారు. తొలిసారిగా వీరే మహిళ ఎమ్మెల్యేలుగా అసెంబ్లీకి వెళ్లారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తర్వాత అసెంబ్లీ ఎన్నికలకు పోటీ చేసే మహిళలు సంఖ్య పెరుగుతూ వచ్చింది. ఉమ్మడి జిల్లాలో 15 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నప్పటికీ కేవలం ఆరు అసెంబ్లీ నియోజవర్గాల నుంచి మాత్రమే మహిళలు ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. వీటిలో మాడుగుల, పాడేరు, పాయకరావుపేట, విశాఖపట్నం-1, విశాఖపట్నం-2, నర్సీపట్నం నియోజవర్గాల నుంచి మాత్రమే మహిళలు అసెంబ్లీకి ఎన్నికయ్యారు. 1983 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తరపున విశాఖపట్నం-1 నియోజవర్గం నుంచి న్యాయవాది గ్రంధి మాధవి, పాయకరావుపేట నుంచి గంటెల సుమన పోటీ చేసి తొలి ప్రయత్నంలోనే విజయం సాధించి అసెంబ్లీలో అడుగు పెట్టారు. 1972 తర్వాత దాదాపు దశాబ్ద కాలం అనంతరం మహిళా ఎమ్మెల్యేలు జిల్లా నుంచి వీరిద్దరూ ఎన్నికయ్యారు. 1985లో జరిగిన ఎన్నికల్లో విశాఖపట్నం-1, విశాఖపట్నం-2 నియోజవర్గాల నుంచి తెలుగుదేశం పార్టీ తరపున పోటీ చేసిన అల్లు భానుమతి, రాజాన రమణి విజయం సాధించారు. 1989 ఎన్నికల్లో విశాఖపట్నం-1 నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన ఈటి విజయలక్ష్మి విజయం సాధించారు. 1999 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తరపున విశాఖపట్నం-2 నియోజవర్గం నుంచి పోటీ చేసిన పిన్నింటి వరలక్ష్మి విజయం సాధించగా, ఆ ఎన్నికల్లో పాడేరు నుంచి తెలుగుదేశం అభ్యర్థిగా పోటీ చేసిన ఎం. మణికుమారి విజయం సాధించి, రాష్ట్రమంత్రి అయ్యారు. 2009 ఎన్నికలలో నర్సీపట్నం నియోజవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన బోళెం ముత్యాలపాప విజయం సాధించారు. 2014లో పాయకరావుపేట నుంచి తెలుగుదేశం అభ్యర్థిగా పోటీ చేసిన వంగలపూడి అనిత, వైసిపి తరపున పాడేరు అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసిన గిడ్డి ఈశ్వరి కూడా విజయం సాధించారు. తాజాగా గత ఎన్నికల్లో పాడేరు నుంచి వైసిపి అభ్యర్థిగా పోటీ చేసిన కొట్టిగిల్లి భాగ్యలక్ష్మి విజయం సాధించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో పురుషుల కంటే మహిళా ఓటర్లు ప్రతి ఎన్నికలలోనూ అధికంగానే ఉంటున్నారు. అయితే వారికి చట్టసభలకు పోటీ చేసే అవకాశం ఆశించిన స్థాయిలో ఉండటం లేదు అనేది యదార్థం.

అడుగడుగునా జగన్‌కు ఘనస్వాగతం

విశాఖలో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి ఆదివారం నగరంలో పలుచోట్ల ఘన స్వాగతాలు లభించాయి.

ప్రజాశక్తి-యంత్రాంగం

గోపాలపట్నం : సిద్ధం యాత్రలో భాగంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సుమారు రెండున్నర గంటల సమయంలో గోపాలపట్నం చేరుకున్నారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు గోపాలపట్నంలో ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికారు. గోపాలపట్నం బుధవారం సంత పక్కన ఉన్న ఖాళీ స్థలంలో ఆయన భోజన విరామం తీసుకున్నారు. అనంతరం నాలుగు గంటల సమయంలో సిద్ధం యాత్రను ప్రారంభించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సిద్ధం బస్సుపై నిల్చొని పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, ప్రజలకు అభివాదం చేశారు. అనంతరం గోపాలపట్నం మీదుగా ఎన్ఎడి కొత్త రోడ్డు మీదుగా యాత్ర కొనసాగింది. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డితో పాటు విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, విశాఖ పార్లమెంట్ అభ్యర్థి బొత్స ఝాన్సీ, పశ్చిమ నియోజకవర్గం అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ బస్సుపై నుంచి ప్రజలకు అభివాదం చేస్తూ తరలి వెళ్లారు.

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి షెడ్యూల్ సమయానికి గోపాలపట్నం చేరినప్పటికీ, పార్టీ కార్యకర్తలు, ద్వితీయ శ్రేణి నాయకులు ఎండలో పడిగాపులు కాశారు. తరలించిన అనేకమంది ప్రజలు ఎండలో అవస్థలు పడ్డారు.

పెందుర్తి : పెందుర్తి మండల పరిధి పినగాడి నుంచి గోపాలపట్నం వరకు రోడ్డు షో నిర్వహించారు. ఉదయం 10:30 గంటలకు షెడ్యూల్ ఇవ్వడంతో జనాలు ముందుగానే చేరుకున్నారు. ఎండగా ఉండటంతో చాలామంది వెనుదిరుగారు. వేపగుంట బంకు సమీపంలోకి జగన్మోహన్ రెడ్డి చేరుకునేసరికి ఒంటిగంట దాటింది. పినగాడి నుంచి వేపగుంట వరకు రోడ్డుకిరువైపులా ఉన్న జనాలకు జగన్మోహన్‌రెడ్డి నమస్కరించారు. ఎండ ఎక్కువగా ఉండడంతో వేపగుంట దాటేసరికి ఎండకు తట్టుకోలేక కాన్వాయ్‌లోకి వెళ్లిపోయారు. జగన్మోహన్‌రెడ్డి మంచి ఎండలో రావడంతో వెళ్లే వాహనదారులకు ట్రాఫిక్ సమస్య ఎదురయ్యాయి. అధికారులు తీరుపై పలువురు అసహనం వ్యక్తం చేశారు.

సీతమ్మధారలో ప్రజలకు అభివాదం చేస్తున్న జగన్, పక్కనే ఎమ్మెల్యే అభ్యర్థి రాజు

నగరంలో సిఎం జగన్ బస్‌యాత్ర

సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గంలోని మద్రిపాలెం, కంచరపాలెం, రైల్వే న్యూ కాలనీ, దొండపర్తి, అక్కయ్యపాలెంలోని మహారాణి పార్లర్, గురుద్వారా జంక్షన్ మీదుగా యాత్ర కొనసాగింది. ధర్మనగర్ వద్ద ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బస్సు దిగి చిన్నారి బాలిక వినతి పత్రాన్ని స్వీకరించి ఆమె సమస్యను విన్నారు. అనంతరం ప్రజలను పలకరిస్తూ యాత్ర కొనసాగింది. ముఖ్యమంత్రి తోపాటు బొత్స సత్యనారాయణ, రాజ్యసభ సభ్యులు వైవి.సుబ్బారెడ్డి, ఎంపీ ఎంవివి.త్యనారాయణ. ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి. ఆనంద్ కుమార్, ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు, భారీ ఎత్తున మహిళలు అభిమానులు కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి మ్యానిఫెస్టోపై
విస్తృత ప్రచారం చేయాలి

కూటమి శ్రేణులకు ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ పిలుపు

ప్రజాశక్తి-.అనకాపల్లి : ఎన్నికల ప్రచారంలో ఉమ్మడి మేనిఫెస్టోను ఓటర్లకు వివరించాలని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ పిలుపునిచ్చారు. ఆదివారం రింగ్ రోడ్డులోని జనసేన కార్యాలయంలో 81వ డివిజన్ ఉమ్మడి సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ వార్డులోని నాయకులు, కార్యకర్తలు, బాధ్యత తీసుకొని పార్టీ ప్రచారంలో పాల్గొనాలని కోరారు. కూటమి అభ్యర్థుల గుర్తులను చూపిస్తూ ఓటేయాలని కోరాలన్నారు. కష్టపడిన ప్రతి కార్యకర్తకూ గుర్తింపు ఉంటుందన్నారు కార్యక్రమంలో 81వ డివిజన్ ఇన్‌ఛార్జి మళ్ల సురేంద్ర, బుద్ధ రాజేష్, విల్లూరి హరి, పెతకం శెట్టి జగన్మోహన్, వేగి కృష్ణ, దాడి అప్పారావు, పెతకంశెట్టి వెంకట్రావు, మారిశెట్టి శంకర్రావు, మళ్ల రామకృష్ణ, పీలా రమణారావు, పీలా రాముడు, పెంటకోట శ్రీనివాసరావు, సరగడం శాంతారాం పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల

కశింకోట : మండలంలోని నర్సింగబిల్లి చింతలపాలెం గ్రామాలలో టిడిపి, జనసేన, బిజెపి కూటమి శ్రేణుల ఆత్మీయ సమావేశమ ఆదివారం జరిగిందీ సందర్భగా పలువురు జనసేనలో చేరగా, వారికి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పార్టీ కండువాలు వేసి జనసేనలోకి ఆహ్వానించారు. అంతకుముందు ఉపాధి కూలీలతో సమావేశమయ్యారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ నిమ్మదల సన్యాసినాయుడు, ,గొంతిన శ్రీనివాసరావు, కాయలు మురళీ, ఉగ్గిన రమణమూర్తి, ఎస్‌కె దర్గా, మజ్జి నాని బాబు, వేగి గోపీకృష్ణ, సిద్ది రెడ్డి శ్రీనివాసరావు, పెంటకోట రాము, సతీష్ పాల్గొన్నారు

జోరుగా సిపిఎం ప్రచారం

పలుచోట్ల ఎమ్మెల్యే అభ్యర్థి జగ్గునాయుడుకు అపూర్వ స్వాగతం

ప్రియదర్శిని కాలనీలో జగ్గునాయుడుకు హారతులిస్తున్న మహిళ

గాజువాక నియోజకవర్గంలోని పలు కాలనీల్లో ఇండియా ఫోరం బలపర్చిన సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి మరడాన జగ్గునాయుడు ఆదివారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు.

ప్రజాశక్తి -యంత్రాంగం

గాజువాక : గాజువాక రైతు బజార్‌లో సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.జగ్గునాయుడు ప్రచారం నిర్వహించారు. రైతు బజార్‌కు వచ్చినవారిని పలకరిస్తూ, తనను గెలిపించాలని కోరారు. నేతాజీ కాలనీలో ప్రచారం నిర్వహించారు. సిపిఎం పోరాట ఫలితంగా గాజువాక హౌస్ కమిటీ సమస్య కొంతవరకు పరిష్కారమైందన్నారు. ప్రియదర్శినికాలనీ, బానోజీతోట, వాంబే కాలనీ, దిబ్బపాలెం నిర్వాసిత కాలనీ, యాతపాలెం వరకు ఎన్నికల ప్రచారం సాగింది. యాతపాలెంలో జగ్గునాయుడు మాట్లాడుతూ, భవన నిర్మాణ కార్మిక సమస్యలపై సిపిఎం అనేక పోరాటాలు చేసినట్లు గుర్తుచేశారు. ఇల్లు లేని వారికి స్థలాలు ఇవ్వాలని సిపిఎం అనేక పోరాటాలు చేసిందని గుర్తుచేశారు.

గంగవరంలో..

జివిఎంసి 64వ వార్డు పరిధి గంగవరంలో కాంగ్రెస్, సిపిఎం ఆధ్వర్యాన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఇండియా కూటమి బలపరిచిన సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.జగ్గునాయుడును, ఎంపీ అభ్యర్థి సత్యారెడ్డిని గెలిపించాలని ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఉమ్మడి సోమేష్, పేర్ల మెసేజ, వాసుపల్లి సోమేష్, శంకర్‌రెడ్డి, సంతోష్‌కుమార్, ఏపీ ఫిషర్ మెన్ కాంగ్రెస్ కో-ఆర్డినేటర్ కె.దేవుడు, కొవిరి దేముడు, ఎస్.అప్పలరాజు పాల్గొన్నారు.

భానోజీ తోటలో....

జివిఎంసి 65వ వార్డు పరిధి భానోజీతోటలో ఇండియా కూటమి బలపరిచిన సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.జగ్గునాయుడు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సిపిఎం పోరాట ఫలితంగా ఇనాంభూ సమస్య కొంతవరకు పరిష్కారమైందన్నారు. మిగిలిన 2000 మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మంచి నీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. గంగవరం పోర్టు కాలుష్యంతో ఆ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా ప్రస్తుత ప్రభుత్వం, నాయకులు పట్టించుకోవడంలేదన్నారు. సిపిఐ నాయకులు కె.సత్యనారాయణ మాట్లాడుతూ, వైసిపి, టిడిపిలో ఏది గెలిచినా బిజెపి గెలిచినట్టేనని తెలిపారు. సిపిఎం అభ్యర్థిని గెలిపించుకోవడమే సరైనదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం గాజువాక జోన్ ఎం.రాంబాబు, వార్డు నాయకులు ఎం.నాగేశ్వరరావు, బి.శ్రీనివాసరావు, ఎం.జ్యోతి, ఆర్.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించండి

ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషిచేసే ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని సిపిఐ నాయకులు అప్పారి విష్ణుమూర్తి, జి.ఆనంద్ కోరారు. విష్ణుమూర్తి కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ, కేంద్రంలో నరేంద్రమోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని రంగాలు నిర్వీర్యమయ్యాయన్నారు. రాష్ట్రంలో ఉన్న అధికార, ప్రతిపక్ష పార్టీలు కేంద్రానికి కొమ్ము కాయడం వల్లే దుర్భర పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ప్రభుత్వ రంగ పరిశ్రమల నిర్వీర్యం, అధిక ధరలతో కార్మిక వర్గం తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటోందన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఇండియా కూటమి సార్వత్రిక ఎన్నికల్లో పోటీచేస్తోందని తెలిపారు. గాజువాక నియోజకవర్గం నుంచి సిపిఎం ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న ఎం.జగ్గునాయుడును, పశ్చిమ నియోజకవర్గం సిపిఐ ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న అత్తిలి విమలను గెలిపించాలని కోరారు.

జోగవానిపాలెంలో...

సిపిఎం అభ్యర్థి ఎం.జగ్గు నాయుడు గెలుపు కోరుతూ ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి ఆధ్వర్యాన 67వ వార్డు పరిధి జోగవానిపాలెం, మారుతీనగర్, గాంధీనగర్ ఏరియాలో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. కొండవాలు ప్రాంతాల ప్రజలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సిపిఎం పోరాటం చేసిన విషయాన్ని గుర్తుచేశారు. పేదల పక్షాన పోరాడే సిపిఎం అభ్యర్థి ఎం.జగ్గునాయుడును గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో ఐద్వా నాయకులు సంతోషం, సిపిఎం నాయకులు కె.కిరీటం, గోపాలపట్నం సిపిఎం కార్యదర్శి బి.వెంకట్రావు, నారాయణ, లీల, తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచంలో ఏ మార్పునైతే
కోరుకుంటావో..
దానికి నువ్వే నాంది పలకాలి
- మహాత్మా గాంధీ



నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి- అనకాపల్లి : పట్టణంలోని విద్యుత్ లైన్ల నిర్వహణ, జంగిల్ క్లియరెన్స్ పనుల నేపథ్యంలో సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఎపిఇపిడిసిఎల్ ఇఇ రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. అనకాపల్లి పట్టణంలో గాంధీనగర్, ఆర్ అండ్ బి బంగ్లా ప్రాంతం, లక్ష్మీదేవి పేట, విజయరామరాజుపేట, ఏఎంసీ కాలనీ మిరియాల కాలనీ, శ్రీరామ నగర్‌కాలనీ, జీవీఎంసీ జోనల్ కార్యాలయ ప్రాంతం, ఉమ్మలాడ జంక్షన్, పూడిమడక రోడ్డు, ఇనప కొట్టు నాగేశ్వరరావు రోడ్డు, ఆర్టీసీ కాంప్లెక్స్ శారద కాలనీ, న్యూ కాలనీ, నెహ్రూ చౌక్ జంక్షన్ తదితర ప్రాంతాల్లో సోమవారం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

వైసిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి- దేవరాపల్లి : మాడుగుల మండలం వీరనారాయణం గ్రామానికి చెందిన 13 కుటుంబాలు టిడిపిని వీడి, ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు సమక్షంలో వైసిపిలో చేరారు. ఆదివారం తారువలోని బూడ స్వగృమంలో ఎంపిటిసి మహేష్, పెంటకోట అంజి, పిఎసిఎస్ అధ్యక్షులు విస్సారపు రామరావు, ఆలమండ గ్రామ సర్పంచ్ దాడి జగన్ ఆధ్వర్యంలో పెంటకోట అంజి, దాడి ప్రేమ్ కుమర్, పీలా వెంకట్రావు, ఎమ్. వెంకటకుమార్, పీలా భాస్కరరావు, మణికంఠ, దాడి అప్పారావు, బీశెట్టి ముత్యాలనాయుడు తదితరులు వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. వీరికి ఉపముఖ్యమంత్రి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి పరీక్ష

ప్రజాశక్తి -కశింకోట : మండలంలోని తేగాడ ఏపి మోడల్ స్కూల్‌లో 6వ తరగతిలో ప్రవేశానికి నిర్వహించిన ప్రవేశ పరీక్షను అమరావతి నుండి వచ్చిన స్టేట్ అబ్జర్వర్ ఎంఆర్‌వి. శామ్యూల్ ఆదివారం సందర్శించారు ఈ సందర్భంగా విద్యార్థులు వసతి. గదులు పరిశీలించారు పరీక్ష కేంద్రమైన తేగాడ మోడల్ స్కూల్‌లో 417 మంది విద్యార్థులు దరఖాస్తు చేయగా, 353 మంది విద్యార్థులు హాజరయ్యారని చీఫ్ సూపరింటెండెంట్ ఐ మార్తాతిలకం తెలిపారు. మండల విద్యాశాఖాధికారి చిట్టిబాబు పాలుగున్నారు

ముగిసిన హస్తకళల నైపుణ్య శిక్షణ

ప్రజాశక్తి - పరవాడ: అద్భుతమైనవి మన కోసం పుట్టుకతో రావని, సృజనతో వాటిని సృష్టించుకోవాలని చెన్నైకి చెందిన నైల్ అండ్ థ్రెడ్ హస్తకళ నిపుణులు మోహనుడు, గీత అన్నారు. వీరి పర్యవేక్షణ లో సంస్కృతి గ్లోబల్ స్కూల్ చిన్నారులకు నిర్వహించిన రెండు రోజుల హస్తకళల శిక్షణ ఆదివారం ముగిసింది. సంస్కృతి గ్లోబల్ స్కూల్ ఛైర్మన్ పి. సూర్యనారాయణ రెడ్డి ప్రారంభించిన శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎన్. సీతాలక్ష్మి మాట్లాడుతూ హస్తకళ భారతదేశ సంస్కృతిలో భాగమన్నారు. ఆది నేటి విద్యార్థుల మనోవికాసానికి, ఊహాశక్తి సామర్థ్యం మెరుగుపరచడానికి ఇటువంటి కళలు దోహదపడతాయన్నారు. పాఠశాల సిఇఒ కె. నిశాంత్, కోఆర్డినేటర్ రామలక్ష్మి, పాఠశాల ఆర్ట్ టీచర్ శంకర్ నారాయణ, ఆర్ట్ క్లబ్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అలరించిన చిన్నారుల నృత్యాలు

ప్రజాశక్తి -అచ్యుతాపురం : ప్రైమ్ రోజ్ ఇంటర్నేషనల్ ప్లే స్కూల్ వార్షికోత్సవాన్ని ఆదివారం సాయంత్రం స్థానికహ్యాపీ ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ దాడి మాధురి ఆధ్వర్యంలో చిన్నారుల నృత్యప్రదర్శనలు పలువురిని అలరించాయి. తల్లిదండ్రులు. బంధువులు చిన్న పిల్లల నృత్యాలు చూసి ఆనందం వ్యక్తం చేశారు.

ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- మునగపాక: ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధి కోసం పరితపించే ఏకైక నాయకుడు టిడిపి జాతీయ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అనితెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్రి సాయికృష్ణ అన్నారు. శనివారం రాత్రి స్థానికపార్టీ కార్యాలయంలో చంద్రబాబు జన్మదిన వేడుకలు పురస్కరించుకుని 74 కేజీల భారీ కేకును కట్ చేశారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు ఘనవిజయం సాధించి ముఖ్యమంత్రిగా రాష్ట్రానికి సేవలు అందించాలని ఆకాంక్షించారు. యలమంచిలి తెలుగు యువత అధ్యక్షులు పెంటకోట విజయ్, రాష్ట్ర తెలుగు రైతు కార్యదర్శి దాడి ముసిలినాయుడు, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు ఆడారి మంజు, బిసి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భీమరశెట్టి శ్రీనివాసరావు, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు టెక్కలి పరశురాం, ఆడారి శ్రీకాంత్ పాల్గొన్నారు.

కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న

బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దింపాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

ప్రజాశక్తి- అనకాపల్లి : కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దింపాల్సిన సమయం ఆసన్నమైందని, వచ్చే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి, దానితో అంటకాగిన జనసేన, టిడిపిలను పరోక్షంగా మద్దతు తీసుకున్న వైసిపిని చిత్తుగా ఓడించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక దొడ్డి రామునాయుడు కార్మిక కర్షక నిలయంలో అఖిలభారత తపాలా, ఆర్ఎంఎస్ పెన్షనర్ల సంఘం తొమ్మిదవ వార్షిక మహాజనసభ జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న లోకనాథం మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాల వల్ల ప్రజలు ఉద్యోగులు, కర్షకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో ఇండియా వేదిక అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలన్నారు. పెన్షనర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఉద్యోగులు ప్రజలతో మమేకమై ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం అనకాపల్లి జిల్లా పోస్టల్ ఆర్ఎంఎస్ పెన్షనర్ల సంఘం కార్యవర్గ ఎన్నికల్లో అధ్యక్ష కార్యదర్శులుగా సిహెచ్ సూర్యనారాయణ, కె.రాజారావు, కోశాధికారిగా టి కోటేశ్వరరావులను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సమావేశానికి విశాఖ ఉమ్మడి జిల్లా నుంచి పలువురు పెన్షనర్లు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన 'బత్తుల'


జిల్లా అధ్యక్షుడు తాతయ్యబాబును అభినందిస్తున్న బుచ్చయ్యపేట టిడిపి నేతలు

ప్రజాశక్తి- అనకాపల్లి : అనకాపల్లి జిల్లా టిడిపి అధ్యక్షునిగా బత్తుల తాతయ్యబాబు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. పట్టణంలోని పార్టీ పార్లమెంటరీ కార్యాలయంలో కూటమి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ తో కలిసి టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కమిటీ సభ్యులు బుద్ద నాగ జగదీశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ తాతయ్యబాబును ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేశారు.

బత్తులకు టిడిపి నేతల అభినందన

బుచ్చయ్యపేట : టిడిపి అనకాపల్లి పార్లమెంటరీ అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించిన బత్తుల తాతయ్యబాబును మండల పార్టీ అధ్యక్షులు గోకవాడ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో స్థానిక టిడిపి నేతలు అభినందించి, సత్కరించారు. కార్యక్రమంలో కోరుకొండ రవికుమార్, వియ్యపు అప్పారావు, జి. శ్రీనివాసరావు, సానాపతి మణికంఠ పాల్గొన్నారు

నేడు నామినేషన్‌కు తరలిరండి : బండారు


ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న బండారు

ప్రజాశక్తి- దేవరాపల్లి : వచ్చే నెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను అనకాపల్లి ఎంపీ అభ్యర్థిగా సీఎం రమేష్‌ను గెలిపిస్తే మాడుగుల రుణం తీర్చుకుంటామని బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. శనివారం రాత్రి మండలంలోని కాశీపురం గ్రామంలో మండల పార్టీ అధ్యక్షులు చిటిమిరెడ్డి సూర్యనారాయణ ఇంటి వద్ద కూటమి మండల కార్యకర్తలతో మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, పార్టీ ఇన్చార్జి పివిజి కుమార్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈనెల 22న మాడుగులలో కూటమి అభ్యర్థిగా నామినేషన్ వేయనున్నట్లు తెలిపారు. సోమవారం ఉదయం 9:30 గంటలకు కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. అదేవిధంగా కూటమి అనకాపల్లి ఎంపీ అభ్యర్థిగా సీఎం రమేష్ ఈనెల 24న అనకాపల్లిలో నామినేషన్ వేయనున్నారన్నారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హాజరవుతున్నారన్నారు. ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ సోదరులు సురేష్ నాయుడు, మండల టిడిపి సీనియర్ నాయకులు పోతల పాత్రునాయుడు, శరభాన సూర్యనారాయణ, చల్లా నానాజీ, దొగ్గ దేముడు నాయుడు, ఎల్లేటి కరుణాకర రావు (నాయుడు), గాలి రవికుమార్, సోమిరెడ్డి గోవింద పాల్గొన్నారు.

నూకాంబికను దర్శించుకున్న భరత్ దంపతులు

నూకాంబిక దర్శనానికి వెళుతున్న భరత్, నివేదిత దంపతులు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి,తాకాశి వీధి నూకాంబిక పండగ సందర్భంగా ఆదివారం అమ్మవారిని అనకాపల్లి నియోజవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్, అతని సతీమణి నివేదిత దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భరత్ కుమార్ దంపతులను ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు తాకాసి రాజేష్ సాదరంగా ఆహ్వానించి, శాలువతో ఘనంగా సత్కరించి తీర్ధ ప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు, వైసిపి నేతలు పాల్గొన్నారు.

కూటమి ప్రచారంలో హైపర్ ఆది


ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న హైపర్ ఆది

ప్రజాశక్తి -మునగపాక: మండలంలోని నాగులాపల్లి, ఒంపోలు, అరబుపాలెం, మునగపాక గ్రామాలలో కూటమి బలపరిచిన ఎలమంచిలి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయకుమార్, టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ ప్రగడ నాగేశ్వరావు, అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ సోదరుడు సీఎం రాజేష్ ఆదివారం ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు జనసేన పార్టీ స్టార్ క్యాంపైనర్ జబర్దస్త్ హైపర్ ఆది పాల్గొని,పురవీధుల్లో తిరుగుతూ గాజు గ్లాసు, కమలం గుర్తులను చూపిస్తూ ఆ గుర్తులపై ఓట్లు వేసి సుందరపు విజయ్‌కుమార్‌ను ఎమ్మెల్యేగా, సీఎం రమేష్‌ను ఎంపీగా గెలిపించాలని కోరారు ఈ సందర్భంగా స్థానికులు హైపర్ ఆదితో సెల్ఫీలు తీసుకునేందుకు ఎగబడ్డారు.

42 మందికి ఉచిత కంటి పరీక్షలు

కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

ప్రజాశక్తి- కశింకోట :మండలంలోని తాళ్లపాలెం జంక్షన్ సత్యసాయి భజన మండలి వద్ద జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో, విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 42 మంది కంటి రోగులను పరీక్షించి, వారిలో 15 మందిని కంటి ఆపరేషన్‌కు ఎంపిక చేసి శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి తరలించారు. కంటి నరాలు చికిత్సకు ఇద్దరిని, కంటి పైపొర చికిత్సకు ఒకరిని, కంటి నీటి కాసుల చికిత్సకు ఇద్దరిని, ,కంటి రెప్పల చికిత్సకు ఒకరిని, చిన్నపిల్లల కంటి చికిత్సకు మరొకరిని ఎంపిక చేసి, శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రిలో నిపుణుల ఆధ్వర్యంలో చికిత్సకు రిఫర్ చేశారు. కార్యక్రమంలో సత్యసాయి భజన మండలి ప్రతినిధి వెంకటరావు, శంకర్ ఫౌండేషన్ క్యాంపు కో ఆర్డినేటర్ సిహెచ్ అశ్విని కుమార్, నర్సింగ్ స్టాఫ్ కృష్ణవేణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వర్షంతో చల్లబడిన వాతావరణం

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం మధ్యాహ్నం కురిసిన మోస్తరు వర్షంతో వాతావరణం చల్లబడింది. ఉదయం నుంచి భానుడు తన ప్రతాపం చూపించినప్పటికీ మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకొని తేలిక పాటి వర్షం పడటంతో ప్రజలు ఒకింత ఉపశమనం పొందారు.

చిన్నపాటి వర్షానికే ఆర్టీసి కాంప్లెక్స్ జలమయం

గొలుగొండ:చిన్నపాటి వర్షానికే గొలుగొండ మండలం కృష్ణదేవిపేట ఆర్టీసి బస్ స్టేషన్ వర్షపు నీటితో నిండి పోతుంది. దీంతో ప్రయాణికులు పలు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. శని, ఆదివారాల్లో కురిసిన వర్షాలకు కాంప్లెక్స్ ఆవరణలో వర్షపు నీరు చేరి ప్రయాణికుల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. ఆర్టీసి అధికారులు ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

కాంప్లెక్స్ ఆవరణలోకి చేరిన వర్షపు నీరు

నిర్మానుష్యంగా ఉన్న రోడ్డు

ఎండలతో విలవిల

ప్రజాశక్తి- కోటవురట్ల:గడిచిన పక్షం రోజులుగా భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు.ఆదివారం కూడా సూరీడు తన విశ్వరూపాన్ని చూపించాడు. దీంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఉదయం 8 గంటలకే భానుడు నిప్పులు చెరగడంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. దీనికి తోడు ఉక్కపోత వడగాలులు కారణంగా వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. వడదెబ్బ బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని పీహెచ్సీ వైద్యులు డాక్టర్ సంతోష్ కుమార్ తెలిపారు. అత్యవసర పరిస్థితి అయితేనే బయట తిరగాలని, తేలికపాటి దుస్తులు ధరించడంతో పాటు ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు.

రేషన్ కార్డులను చూపుతున్న గిరిజనులు

రేషన్ బియ్యంలో కోత

ప్రజాశక్తి -అరకులోయ రూరల్:పేదలకు ఇచ్చే రేషన్ బియ్యంలో కోత విధిస్తుండటంతో గిరిజనులు అవస్థలు పడుతున్నారు. ఈనెలలో ఇచ్చిన రేషన్ బియ్యంలో కిలో కుదించి బియ్యంలో కోత విధించడం ఏమిటని గిరిజనులు ప్రశ్నిస్తున్నారు. మండలంలోని చిన్నలబుడు పంచాయతి గొందివలస గ్రామాల్లో సుమారు 110 రేషన్ కార్డులున్నాయి. ప్రతి కార్డుదారుడికీ కిలో బియ్యం కోత విధించడంతో గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. డిపో సెల్స్ మెన్‌ను అడిగేతే ఆయనకు సంబంధం లేదని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అందజేశానని పొంతన లేని సమాధానమిస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. పేదలకు సరఫరా చేసే బియ్యంలో కోత విధించడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఇస్తున్న రేషన్ బియ్యం పై ఆధారపడి జీవనం సాగిస్తున్నామని,, కోత పెడితే బతికేది ఎలాగని వారు ప్రశ్నించారు. తక్షణమే కోత పెట్టిన బియ్యం ఇవ్వాలని, సేల్స్‌మెన్‌పై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్, జి.ప్రకాష్, అనిల్, చిట్టిబాబు డిమాండ్ చేశారు.

పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ పూర్తి

ప్రజాశక్తి -కోటవురట్ల:వచ్చే నెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా తొలిసారిగా వృద్ధులకు, దివ్యాంగులకు, సహా వివిధ కారణాలతో గృహానికి పరిమితమైన వారికి ఎలక్షన్ కమిషన్ పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఏర్పాటు చేస్తుంది. ఈ నేపథ్యంలో స్థానిక తహసిల్దార్ వెంకటరమణ ఇచ్చిన వివరాల ప్రకారం..., మండల వ్యాప్తంగా గుర్తించిన పలువురికి ఫారం-12 డి ద్వారా ఓటు హక్కు కల్పిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా 52 పోలింగ్ కేంద్రాలకు గాను వృద్ధులు 747 మంది, 85 సంవత్సరాలు దాటిన వారు 186 మంది ఉండగా బూత్ లెవెల్ అధికారులు వారి అభిప్రాయాలు సేకరించిన పిదప దివ్యాంగులు 18, వృద్ధులు 18, బెడ్ రెస్ట్ కు సంబంధించిన వారిని 8 మందిని గుర్తించారు. మండల వ్యాప్తంగా 44 మందికి పోస్టల్ బ్యాలెట్ ఓటు వేసుకునే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. పాములవాకలో 2, బికేపల్లి5, అన్నవరం 8, ఎండపల్లి2, జల్లూరు1, బోడపాలెం5, చిన్న బొడ్డేపల్లి 2, కొడవటిపూడి3, వెంకటాపురం 2, కోటవురట్ల2, లింగాపురం 5, సుంకాపూరు 2, రాజుపేట 4, రామచంద్రపురం1, చొప్పున గుర్తించామని తెలిపారు. మీరందరికి పోస్టల్ బ్యాలెట్ సిద్ధం చేసినట్లు తెలిపారు, ఓటర్ల ఎటువంటి ప్రలోభాలకు గురికాకుండా సిబ్బందిని అప్రమత్తం చేశామని ఈ సందర్భంగా తెలిపారు.

పోస్టల్ బ్యాలెట్ కై అభిప్రాయం తీసుకుంటున్న ఉద్యోగి (ఫైల్)

జనసేనలో పలువురు చేరిక

ప్రజాశక్తి-కోటవురట్ల: మండల కేంద్రంలో ఆదివారం వైసీపీ నుండి జనసేన పార్టీలో జిల్లా నాయకులు గడ్డం బుజ్జి, మండల పార్టీ అధ్యక్షులు సింగంపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మాజీ వార్డు సభ్యులు బత్తిన అప్పారావు, ఉదయ్ కుమార్ సహా పలువురు జనసేన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.

అనకాపల్లి : మండలం వెంకుపాలెం గ్రామానికి పలువురు యువకులు కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. వీరందరికీ కండువాలు వేసి జనసేనలోకి రామకృష్ణ ఆహ్వానించారు. భీశెట్టి సుధ (తమ్మునాయుడు) ఆధ్వర్యంలో బొడ్డేడ భాస్కర్, బుద్ధ సురేష్, దొడ్డి సురేష్, ఉదయ్ భాస్కర్, అడారి నానాజీతోపాటు 50 మంది చేరారు.

సబ్బవరం: మండలంలోని ఆరిపాక పంచాయతీలో స్థానిక వైఎస్ ఎంపిపి శరగడం ఝాన్సీలక్ష్మీ రాణి రాము ఆధ్వర్యంలో వైసిపి నుంచి పలువురు జనసేనలో చేరారు. పెందుర్తి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబు కండువాలు కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు.కార్యక్రమంలో బొడ్డేటి కాశి సూరప్పారావు, బత్తిన శివ కోటేశ్వరరావు, ధార అర్జునరావు, ధార రాము, శరగడం నాగభూషణం, సత్యనారాయణ, శంకర్ నాయుడు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట :

మండలంలోని పెదపూడికి చెందిన నలుగురు వార్డు సభ్యులతోపాటు 50 కుటుంబాలు ఈనెల 24న జనసేనలో చేరుతున్నట్లు వైసిపి మండల మాజీ ప్రధాన కార్యదర్శి దుర్గవరపు రవి పత్రికా సమావేశంలో తెలిపారు గ్రామంలో వైసిపి నేతలు చేస్తున్న కుటిల రాజకీయాలకు విసుగుచెంది వైసిపిని వీడుతున్నట్లు వెల్లడించారు .ఈ సందర్భంగా విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు

ఎలుగుబంటి దాడితో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి -హుకుంపేట: మండలంలోని కొట్నాపల్లి పంచాయతీ ఎగమాలపాడు కొండపైకి కట్టెల కోసం వెళ్లిన కొర్ర లచ్చన్నపై ఎలుగుబంటి దాడి చేయడంతో గాయాల పాలయ్యారు. ఆలస్యంగా ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. శుక్రవారం మధ్యాహ్నం కొర్ర లచ్చన్న కట్టెల నిమిత్తం కొండపైకి వెళ్లాడు. కట్టెలను సేకరించి తిరిగి వస్తున్న సమయంలో మార్గమధ్యలో ఎలుగుబంటి దాడి చేసింది.తలపై బలమైన గాయాలు కావడంతో వైద్య సేవలు నిమిత్తం పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. గాయాల పాలైన లచ్చన్నను ఆదుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షులు తాపుల కృష్ణారావు కోరారు.

అనితకు బి.ఫారం

ప్రజాశక్తి -నక్కపల్లి:పాయకరావుపేట నియోజకవర్గం అసెంబ్లీ కూటమి అభ్యర్థి వంగలపూడి అనిత బి ఫారం అందుకున్నారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉండవల్లిలో తన స్వగృహంలో ఆదివారం అనితకు తన చేతుల మీదుగా బి ఫారం అందజేశారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ, తనపై ఉన్న నమ్మకంతో పాయక రావుపేట నియోజక వర్గం అసెంబ్లీ అభ్యర్థిత్వాన్ని తనకు కేటాయించి, బి ఫారం అందజేసిన చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

బి.ఫారం అందుకుంటున్న అనిత

నేడు ప్రధాన పార్టీల అభ్యర్థుల నామినేషన్

ప్రజాశక్తి -నక్కపల్లి:పాయకరావుపేట నియోజకవర్గం అసెంబ్లీ స్థానానికి పోటీలో నిలిచిన ప్రధాన పార్టీల అభ్యర్థులు సోమవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. వైసిపి అభ్యర్థి కంబాల జోగులు, కూటమి అభ్యర్థి వంగలపూడి అనిత సోమవారం ఉదయం స్థానిక తహసీల్దార్ కార్యాలయం లో నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఇరు పార్టీల అభ్యర్థులు భారీ జనసంద్రోహంతో నామినేషన్లు వేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. నామినేషన్ సమయంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు .

మాట్లాడుతున్న సిఐ క్రాంతికుమార్

అసాంఘిక కార్యక్రమాల్లో పాల్గొనొద్దు

-నర్సీపట్నం టౌన్ సిఐ క్రాంతికుమార్

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్: ఎన్నికల సమయంలో ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని నర్సీపట్నం టౌన్ సీఐ క్రాంతికుమార్ హెచ్చరించారు. ఆదివారం సాయంత్రం నర్సీపట్నం పరిధిలోని రౌడీషీటర్లను పిలిపించి మాట్లాడారు. ఎన్నికల నేపథ్యంలో నిబంధనలు ఉల్లంఘిస్తే పీడీ యాక్ట్ ఓపెన్ చేయడం జరుగుతుందన్నారు. అలాగే మరిడిమాంబ పండుగ సందర్భంగా ఎక్కడైనా గొడవలు సృష్టిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఎస్సైలు సుధాకర్, ఉమామహేశ్వరావు పాల్గొన్నారు.

అనకాపల్లిలో అభివృద్ధి ఏదీ?

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్: స్వాతంత్రం వచ్చి నాటి నుండి అనేక ప్రభుత్వాలు మారినా అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో ఇటువంటి అభివృద్ధి కానరాలేదని సమాజ్ వాది పార్టీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి కోన గురవయ్య యాదవ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నర్సీపట్నం వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ, తనను గెలిపిస్తే అనకాపల్లిని విశాఖ నగరం స్థాయిలో అభివృద్ధి పథంలో నడిపిస్తానని ఆయనన్నారు. అతిపెద్ద రాష్ట్రమైన ఉత్తర ప్రదేశ్‌లో సమాజ్ వాది పార్టీ ప్రభుత్వాన్ని స్థాపించిందని, అలాగే ఆంధ్రప్రదేశ్ లో కూడా త్వరలోనే ప్రభుత్వం ఏర్పాటు చేసే దిశగా కృషి చేస్తున్నామన్నారు. అనకాపల్లి బెల్లం మార్కెట్ ను అంతర్జాతీయ ఖ్యాతిలో మరింత అభివృద్ధి చేస్తామని, మూతబడిన చెక్కర కర్మాగారాలను తెరిపించి, చక్కెర రైతులకు గిట్టుబాటు ధర అందించడమే కాకుండా, కొత్త పరిశ్రమలు తీసుకువచ్చి యువతకు ఉపాధి కల్పిస్తామన్నారు.

మజ్జిగను పంపిణీ చేస్తున్న కుటుంబీకులు

రెడ్డిపల్లిలో మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి- పద్మనాభం : మండలంలోని రెడ్డిపల్లి గ్రామపంచాయతీలో అనుమాలుశెట్టి వెంకటరావు జ్ఞాపకార్ధం కుమారుడు శ్రీనివాసరావు పద్మనాభం నుంచి విజయనగరం వెళ్లే రోడ్డులో వారి ఇంటి వద్ద మజ్జిగ పంపిణీ చేశారు. ఈ రహదారిలో ప్రయాణించిన వాహనదారులు మజ్జిగను తీసుకొని ఉపశమనం పొందారు. శ్రీ శ్రీనివాస యువజన సేవా సంఘం ఆధ్వర్యాన రేవిడిలో మజ్జిగ చలివేంద్రాన్ని వెంపాడ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు వెంపాడ శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిఎన్‌టి హెల్పింగ్ హాండ్స్ అధ్యక్షులు వాండ్రాసి సతీష్, రేవిడి రిటైర్డ్ ఎండిఒ సత్య బాపిరాజు, తోగురోతు తమ్మునాయుడు, శ్రీనివాస యువజన సేవా సంఘం అధ్యక్షులు కోన సన్యాసినాయుడు, ఉపాధ్యక్షులు పాండ్రంగి సత్యం నాయుడు, కార్యదర్శి పద్మనాభ స్వామి, సహాయ కార్యదర్శి రెడ్డి నారాయణప్పడు, తదితరులు పాల్గొన్నారు.

పాడేరులో కూటమి అభ్యర్థి మార్పు

ప్రజాశక్తి -పాడేరు: ఎట్టకేలకు పాడేరు మాజీ ఎమ్మెల్యే టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి గిడ్డి ఈశ్వరి కే పాడేరు అసెంబ్లీ టిడిపి సీటు దక్కింది. చివరికి ఆదివారం ఉదయం విజయవాడలో చంద్రబాబు చేతుల మీదుగా గిడ్డి ఈశ్వరి బి ఫామ్ అందుకోవడంతో పాడేరు అసెంబ్లీ టిడిపి సీటు కేటాయింపు పై కొన్నాళ్లుగా ఏర్పడిన తీవ్ర ఉత్కంఠకు తెరపడింది. అరకు లోక్ సభ పరిధిలోని సాలూరు, రంపచోడవరం, పార్వతీపురం, కురుపాం సెగ్మెంట్ల అభ్యర్థులతో కలిసి ఈశ్వరి టిడిపి అధినేత చంద్రబాబు నుండి బి ఫామ్‌ను అందుకున్నారు.

బీ పామ్ చూపుతున్న గిడ్డి ఈశ్వరి

2014లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి పాడేరు ఎమ్మెల్యేగా ఈశ్వరి ఎన్నికయ్యారు. నియోజకవర్గంలో ప్రతిపక్ష ఎమ్మెల్యేగా మూడేళ్ల పాటు వ్యవహరించి వైసిపి ఎమ్మెల్యేగా గిరిజన సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ అధికార తెలుగుదేశం పార్టీకి దీటుగా పనిచేసే ఈశ్వరి తనకంటూ ఒక ప్రత్యేకతను చాటుకున్నారు. అనూహ్యంగా 2017 నవంబర్లో అధికార తెలుగుదేశం పార్టీలో చేరారు. 2019 ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందారు. గత ఐదేళ్లు ఆమె టిడిపి నియోజకవర్గ ఇన్చార్జిగా ఉన్నారు. బూత్ స్థాయిల్లో క్యాడర్ను పెంచుకొని నియోజకవర్గ టిడిపిలో ఎదిగారు. అయినప్పటికీ ఆమె పాడేరు అసెంబ్లీ టిడిపి సీటు దక్కించుకోవడానికి ప్రయాసకు గురి కావలసి వచ్చింది. పాడేరు టిడిపి సీటు కిల్లు వెంకట రమేష్ నాయుడుకు కేటాయించినట్లు తుది జాబితాలో అధిష్టానం ప్రకటించడంతో నియోజకవర్గ ఇన్చార్జిగా ఉన్న తనకే సీటు వస్తుందని భావించిన ఈశ్వరికి ఊహించని విధంగా షాక్ తగిలింది. చివరి దాకా ఎదురుచూసిన గిడ్డి ఈశ్వరికి కి ఆశాభంగం కావడంతో ఆమె ఇక ఇండిపెండెంట్ గా పాడేరు అసెంబ్లీ పరిధిలో నిలుస్తున్నట్లు ప్రకటించారు. అన్ని మండలాల టిడిపి క్యాడర్ నుంచి కూడా ఆమెకు మద్దతు లభించడంతో పోటీకి సిద్ధమయ్యారు. ఈ క్రమంలో టిడిపి అధిష్టానం తేరుకొని మళ్లీ సర్వే జరిపి ఈశ్వరి నే బరిలో దింపాలనే ఆలోచనతో చివరికి బీఫామ్ ఆమె చేతికి అందించడంతో 22న సోమవారం ఆమె నామినేషన్ వేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇందుకు నాయకులు, కార్యకర్తలు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

అభివృద్ధికి ఆమడ దూరంలో.. అర్ల

-కానరాని రహదారి సౌకర్యం-పాఠశాలకు మంజూరు కాని నాడు నేడు నిధులు

ప్రజాశక్తి-రోలుగుంట: మండలంలో 2021 సంవత్సరంలో మూడు పంచాయతీలు ఏర్పడ్డాయి. ఈ విధంగా రొంగలపాలెం, పడాలపాలెం, అర్ల పంచాయతీలు ఏర్పడ్డాయి. దీనిలో భాగంగా మండలంలో మైదాన ప్రాంత గిరిజన గ్రామాల్లో అర్ల పంచాయతీ కొత్తగా ఏర్పాటైంది. ఈ గ్రామం గతంలో వి.శరభవరం పంచాయతీకి శివారు గ్రామంగా ఉండేది. అర్ల, గుర్రాలబయలు, గదబపాలెం, లోసింగి, కొత్తలోసింగి ఈ ఐదు గ్రామాలను కలుపుకొని అర్ల పంచాయతీ ఏర్పడింది.

మండలంలో 16 శివారు గ్రామాల్లో గిరిజనులు కొందులు, కమ్మర్లు, గదబలు కోవకు చెందిన వారు జీవనం సాగిస్తున్నారు. ఈ 16 గ్రామాల్లో ఉన్నవారిని రెండు పంచాయతీ గ్రామాలుగా ఏర్పాటు చేస్తే అందరికీ అభివృద్ధి జరుగుతుందని మండల సిపిఎం నాయకులు ఈరెల్లి చిరంజీవి ఆయా గ్రామాలకు చెందిన స్థానిక పెద్దలు కలిసి మండల నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. అయినా వారి కృషి ఫలించలేదు. అధికారంలో వైసిపి ఉండటంతో అర్ల గ్రామాన్ని ఎంపిక చేశారు. దాంతో ఐదు గ్రామాలు అభివృద్ధి చెందుతాయని వారంతా భావించారు.

గ్రామానికి ఇదే అటవీ మార్గం

2022లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో పంచాయతీ సర్పంచ్‌ని ఎన్నుకున్నారు. వైయస్సార్ పార్టీ బలపరిచిన సర్పంచ్ గెలిచారు. కొత్త పంచాయతీ ఏర్పాటు అయిన తర్వాత రహదారి, పంచాయతీ బిల్డింగ్‌కు ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదు. జగనన్న కాలనీకి నిధులు మంజూరు కాలేదని గ్రామస్థులు వాపోయారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. అప్పట్లో రహదారి సౌకర్యం లేక సంపూర్తిగా ఇళ్లు నిర్మించకోలేకపోయారు. గ్రామానికి ఆనుకొని గెడ్డ ఉంది. ఆ గెడ్డలో నుండి మెటీరియల్ తెచ్చుకోవడానికి ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చేది. వర్షం పడితే ద్విచక్ర వాహనాలు కూడా వచ్చేవి కావు. వర్షం పడితే పాఠశాలలు మూసివేయాల్సి వచ్చేది. రేషన్ తెచ్చుకోవడానికి ఇబ్బందులు ఎదుర్కొనేవారు. అనంతరం రాజన్నపేట నుండి అర్లకు, అర్ల నుండి రత్నంపేటకు సుమారు 15 కోట్ల నిధుతో రహదారితో పాటు బ్రిడ్జి నిర్మాణం చేశారు. అప్పట్లో 4లక్షలతో అంగన్వాడీ బిల్డింగ్‌ను నిర్మించారు. బిల్డింగ్ నిర్మించిన గుత్తేదారునికి బిల్లులు కాక పోవడంతో ఆ బిల్డింగ్ ఈ ఐదు సంవత్సరాల్లో ప్రారంభించక పోవడం విశేషం. నాడు నేడు పాఠశాలల బిల్డింగ్‌నకు కూడా నిధులు మంజూరు చేయలేదు. కొత్త పంచాయతీ ఏర్పాటైన ఎటువంటి అభివృద్ధి నోచుకోకపోవడం గమనార్హం.

అర్ల గ్రామం

గ్రామానికి రహదారి మార్గం

కార్మికుల భద్రతపై నిర్లక్ష్యం తగదు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: పారిశ్రామిక సంస్థల్లో కార్మికుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని విధిగా భద్రతా ప్రమాణాలు అమలు చేయాలని, చాలా సంస్థల్లో ఈ ప్రమాణాలు లేకపోవడంతో అధిక సంఖ్యలో గాయాలపాలవుతున్నారని, వీటి నివారణకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఫ్రీ ట్రేడ్ యూనియన్స్ ఆఫ్ ఇండియా(సిఎస్ టియుఐ) జాతీయ అధ్యక్షుడు ఎన్.కనకారావు కోరారు. డాబాగార్డెన్ వి- హోటల్లో సిఎఫ్‌టియుఐ ఆధ్వర్యం లో కార్మికుల సంక్షేమం, భద్రత, ఆరోగ్య సమస్యల నివారణకు కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న నివారణ చర్యలపై ప్రత్యేకంగా వర్క్ షాపును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రపంచ బ్యాంక్ ప్రకారం భారత దేశం 60 కోట్ల బలమైన శ్రామిక శక్తిని కలిగి ఉందని, వీరిలో రెండు కోట్ల మంది పారిశ్రామిక కార్మికులు ఉన్నారని తెలిపారు. ప్రభుత్వ గణాంకాల ప్రకారం ప్రతి వెయ్యి మంది కార్మికుల్లో 1.26 మంది ప్రతి ఏటా తీవ్రంగా గాయపడుతున్నారన్నారు. కార్మికులకు రక్షణ కల్పించే విషయంలో యాజమాన్యాలు, ప్రభుత్వాలు ఐఎల్‌వో చట్టాల ప్రకారం భద్రతా ప్రమాణాలు అమలు చేస్తే అనేక ప్రమాదాలను నివారించవచ్చునని ఇప్పటికే పలు సర్వేలు, నివేదికలు వెల్లడిస్తున్నాయన్నారు. దీనికి సంబంధించి ఇంటర్నేషనల్ ట్రేడ్ యూనియన్ కాన్ఫెడరేషన్ అనుబంధం సంస్థ సిఎఫ్ టియుఐ సంస్థ సురక్షితమైన, ఆరోగ్యవంతమైన పని వాతావరణం ఒక ప్రాథమిక హక్కు అనే పేరుతో అన్ని ప్రాంతాల్లో అవగాహన సదస్సులు, వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మాణ్ మజ్దూర్ పంచాయతీ సంఘం అడిషనల్ సెక్రటరీ గీతా రామకష్ణన్, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ మానివేళన్, ఎయు సెంటర్ ఫర్ డిఫెన్స్ స్టడీస్ ప్రొఫెసర్ ఎ.వెంకట రమణ, దేశ నలుమూల నుంచి వచ్చిన పలువురు సిఎఫ్ టియుఐ సభ్యులు పాల్గొన్నారు. భద్రతా ప్రమాణాలు, ఓఎస్‌హెచ్ సూత్రాలను ఉల్లంఘిస్తున్న పారిశ్రామిక యాజ మాన్యాలపై కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సదస్సులో తీర్మానం చేసి పంపిపనట్టు నిర్వాహకులు తెలిపారు.

మహిళలపై పెరుగుతున్న అఘాయిత్యాలు

-తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు అనంతలక్ష్మి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: మహిళా ద్రోహి జగన్ రెడ్డి అని తెలుగుమహిళ జిల్లా అధ్యక్షురాలు సర్వసిద్ధి ఆనంతలక్ష్మి విమర్శించారు. ఆదివారం టిడిపి జిల్లా కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ, జగన్ మహిళలకు అన్ని విధాలా మాయమాటలు చెప్పి మోసం చేసిన జగన్ రెడ్డి మహిళా ద్రోహిగా రాష్ట్ర చరిత్రలో మిగిలి పోతాడని విమర్శించారు. నాసిరకం మద్యం సరఫరా చేస్తూ మహిళల తాళిబొట్టులను తెంచుతున్నారన్నారు. సొంత చెల్లి, తల్లి ని బయటకు పంపించిన వ్యక్తి జగన్మోహన్ రెడ్డి అని, ఇంట్లోనే మహిళకు న్యాయం చేయలేని జగన్ రాష్ట్రంలోని మహిళకు ఏమి న్యాయం చేస్తాడని ప్రశ్నించారు. వివేకా హత్య విషయంలో సోదరి సునీత ప్రశ్నలకు జగన్ ఎందుకు సమాధానం చెప్పడం లేదన్నారు. జగన్ కు గులకరాయి తగిలితే బోరున ఏడ్చిన శ్రీరెడ్డి మహిళల తాళిబొట్టులను తెంచుతుంటే ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. జగన్ ముఖ్యమంత్రి అయిన తరువాత మహిళలపై అఘాయిత్యాలు పెరిగి పోయాయన్నారు. తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి గణగళ్ళ సత్య మాట్లాడుతూ జగన్ మహిళ ద్రోహి కాబట్టే సొంత చెల్లి జగన్ కు ఓటు వేయద్దు అంటుంది అని ఎద్దేవా చేశారు. రాష్ట్ర మహిళలు ఇప్పటికైనా మేలుకొని ఎన్నికల్లో జగన్ కు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

గుమ్మడివానిపాలెంలో క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి-ఆనందపురం : ఆనందపురం మండలం శొంఠ్యాం పంచాయతీ గుమ్మడివానిపాలెంలో క్రికెట్ టోర్నమెంట్‌ను ఘట్టమనేని ఎస్టేట్స్ యజమాని ఘట్టమనేని చంద్రబోస్‌తో కలిసి గంటా రవితేజ ప్రారంభించారు. టోర్నమెంటుకు మండలంలో 8 టీమ్‌లు పాల్గొంటున్నాయి. శొంఠ్యాం మాజీ ఉపసర్పంచ్ కోరాడ శ్రీను ఆధ్వర్యాన సమ్మర్ ప్రీమియర్ లీగ్ పేరిట గ్రామంలో ఏటా నిర్వహిస్తుంటారు. ఈ టోర్నమెంట్ ప్రారంభంలో గంటా రవితేజ మాట్లాడుతూ మానసికోల్లాసానికి, శారీరక దారుఢ్యానికి క్రీడలు దోహదపడతాయన్నారు. అలసటను జయిస్తాయన్నారు. క్రీడా మైదానానికి అవసరమైన వసతులు కల్పిస్తామన్నారు. మండలంలోని ప్రతి పంచాయతీలో క్రీడాభివృద్ధికి సహకారామందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బల్రెడ్డి మల్లికార్జునరావు (చంటి), గండ్రెడ్డి రమేష్, రాజు, శ్రీకాంత్, ఆర్గనైజర్స్ గోపి, కోరాడ వైకుంఠం, రామకృష్ణ, అప్పలనారాయణ, అప్పలరాజు, మచ్చ శ్రీను, మచ్చ రామనాయుడు, కోరాడ వేణు, ఎడ్ల సాంబశివరావు, కోరాడ రమణ, తదితరులు పాల్గొన్నారు.